


# అనుదినము నాన్నగారితో

# Contents

అన్నం పరబ్రహ్మ స్వరూపం 1
నీ భౌతిక జీవితానికి, ఆధ్యాత్మిక జీవితానికి వ్యత్యాసం చూడకు 2
గురువు హృదయంలో భక్తుల మధ్య బేధం లేదు 3
ప్రతిఫలాపేక్ష లేకుండా పనిచేయాలి 4
సత్యం మాత్రమే నీలోంచి నిన్ను విడుదల చేస్తుంది 5
మన నిజ స్వరూపానికి మరణం లేదు 6
అనుగ్రహంగా మారిన సమర్పణలు 7
మనసుని శుద్ధి చేసుకోవడం అవసరం 8
శరీరం నువ్వు కాదు 9
ఎప్పుడూ శాంతిని కోల్పోవద్దు 10
ప్రారబ్ధాన్ని ప్రీతిగా అనుభవించాలి 11
స్వప్రయత్నంతో కోపాన్ని తొలగించుకోవాలి 12
ధనం ఎక్కువా వద్దు! తక్కువా వద్దు 13
గురువే మన రక్షకుడు 14
మనస్సుని అంతర్ముఖం చేసుకో 15
మోక్షం ఇచ్చే సమయం కోసం భగవంతుడు ఎదురు చూస్తున్నాడు 16
కర్త లేని కర్మ చేయడం యోగం 17
మనోనిగ్రహానికి ఎన్నో మార్గాలున్నాయి 18
ప్రతీదీ ప్రారబ్ధాన్ని అనుసరించి జరుగుతుంది 19
భగవంతుడు నీకు కేటాయించిన పనిని ఇష్టంగా చెయ్యి 20

# అన్నం పరబ్రహ్మ స్వరూపం

ఒకసారి హొటల్లో నాన్నగారు, డా. ఉషగారు కలిసి కూర్చుని భోజనం చేసినప్పుడు, విస్తరిలో ఎక్కువ ఆహార పదార్థాలు వడ్డించడం జరిగింది. ఆమె తినలేక అవస్థ పడుతుంటే నాన్నగారు, ఏమ్మా ఎక్కువయిందా? తినలేకపోతున్నావా? అని అడిగారు. అవును నాన్నగారూ అంటే, "అన్నం పరబ్రహ్మ స్వరూపం" అమ్మా! ముందే తక్కువ వడ్డించమని చెప్పాలి, అవసరమైతే మళ్ళీ పెట్టించుకోవాలి. అంతే కానీ, పెట్టిన తరువాత వృధా చేయకూడదు అన్నారు. చాలా ఆప్యాయంగా, ఎంతో ప్రేమగా చెప్పడం వల్ల తినడం కష్టమైనా కూడా మొత్తం తినడం జరిగింది.

ఆ సంఘటన తరువాత జీవితంలో ఎప్పుడూ ఆహార పదార్థాలు వృధా చేయలేదని ఆమె తన అనుభవంగా తెలియజేసారు. నాన్నగారు ఆధ్యాత్మిక విషయాలు బోధించడంతో పాటు, నిత్యజీవితంలో మన అలవాట్లు, నడవడిక ఎలా ఉండాలో కూడా సందర్భాన్ని బట్టి ప్రేమతో వివరించి సరిచేస్తూనే ఉండేవారు.



# నీ భౌతిక జీవితానికి, ఆధ్యాత్మిక జీవితానికి వ్యత్యాసం చూడకు

ఒకసారి ఒక భక్తుడు ఆయన కొడుకుని తీసుకొని నాన్నగారి దగ్గరకు వచ్చారు. మా అబ్బాయి నాకు పెళ్ళి చేసుకోవాలని లేదు, నేను చేసుకోను అంటున్నాడు. విదేశాల్లో తను చేస్తున్న ఉద్యోగం కూడా వదిలేసి, తన పూర్తి సమయాన్ని ధ్యానంలో గడుపుతాను అంటున్నాడు అని నాన్నగారితో చెప్పారు. అప్పుడు నాన్నగారు ఆ అబ్బాయితో నువ్వు భౌతిక జీవితానికి, ఆధ్యాత్మిక జీవితానికి వ్యత్యాసం చూడకు. ఆధ్యాత్మికం, భౌతికం రెండూ వేరు కావు. భౌతిక జీవితంలో నువ్వు సక్రమంగా పనిచేస్తే అది ఆధ్యాత్మికమే అవుతుంది.

విష్ణు సహస్ర నామాల్లో వెయ్యినామాలు ఉంటాయి. అందులో ఒక నామం విశ్వం అని ఉంటుంది. అంటే విశ్వం రూపంలో ఉన్నది కూడా ఆయనే. అంతటా ఉన్నది, అందరిలో ఉన్నది ఆయనే కాబట్టి, నువ్వు చేసే పని ఆయన పని అనుకుని చేస్తే అది మోక్షానికి దారి తీస్తుంది. భగవద్గీతలో కృష్ణుడు బహుజన్మల కృషి వలనే ఆత్మజ్ఞానం వస్తుందని చెప్పాడు. బుద్ధుడు కూడా బహు జన్మలలో తను చేసిన సత్కర్మ వల్లే తనకు నిర్వాణం (మోక్షం) కలిగిందని చెప్పాడు.

జ్ఞానమూ, కర్మ పక్షికి ఉండే రెండు రెక్కలలాంటివి. రెండు రెక్కలూ సమానంగా పనిచేస్తేనే పక్షి ఎగరగలుగుతుంది. అలాగే, జ్ఞానమూ, కర్మా పరస్పర విరుద్ధమైనవి కావు. జ్ఞానం పొందడానికి రెండూ అవసరమే! చాలామంది ఉద్యోగమూ, బాధ్యతలూ వదిలేసి ఆధ్యాత్మికంగా ఎదగాలని అనుకుంటారు. కానీ అది తప్పించుకుని తిరగడం అవుతుంది. అప్పుడు ఏమవుతుందంటే ఇహమూ, పరమూ రెండిటికీ చెందకుండా అవుతారు. అందుచేత, ఇంకొక 20 సంవత్సరాలు నువ్వు పని చేస్తేనే మంచిదని ఆ అబ్బాయికి చెప్పి పంపించారు.



# గురువు హృదయంలో భక్తుల మధ్య బేధం లేదు!

బుజ్జి అనే ఒక భక్తుడు ( సేవకుడు ) నిరంతరం నాన్నగారి దగ్గర ఉండి ఆయన పనులన్నీ చేసేవాడు. నాన్నగారి ప్రవచనాలను రికార్డ్ చేసి కేసెట్లుగా తయారు చేయించేవాడు. అతను ఒకసారి నాన్నగారిని "అందరు భక్తులూ గురువు గారికి సమానం ఎలా అవుతారు?" అని అడిగాడు.

అప్పుడు నాన్నగారు, “బాహ్యంగా చూడటానికి వేరు వేరుగా అనిపించవచ్చు. కానీ, గురువు హృదయంలో మాత్రం అందరు భక్తులూ సమానమే!" అన్నారు. అది విన్న వెంటనే ఆయన చుట్టూ ఉన్న భక్తులంతా ఆనందంతో చప్పట్లు కొట్టారు.




# ప్రతిఫలాపేక్ష లేకుండా పనిచేయాలి

నాన్నగారిని ఒక భక్తుడు, మీరు మౌనమే బంగారం అంటారు కదా! ఆ స్థితికి మేము ఎప్పుడు చేరతాము? ఆ బంగారం ఎప్పుడు మా సొంతమవుతుంది? అని అడిగారు.

ఆ ప్రశ్న వినగానే నాన్నగారు కాసేపు మౌనంలోకి వెళ్ళారు. తరువాత, ఆత్మ విద్యని సొంతం చేసుకోవడానికి అంత సులభంగా అర్హత వచ్చేయదు. ఆ అర్హత మనం పొందాలి అంటే, జ్ఞానసముపార్జన చేసి దానిని అర్థంచేసుకునే స్థాయికి మనం ఎదగాలి అంటే, నువ్వు ప్రతిఫలం ఆశించకుండా భక్తి, శ్రద్ధలతో పనిచేయడం అలవరుచుకోవాలి. అంటే, కర్తలేని కర్మ చేయాలి. ఈ ప్రక్రియ అంతా గురువు అనుగ్రహం లేకుండా జరగదు. అనుగ్రహం వల్లనే ఆయన జ్ఞానబోధ అర్థం అవుతుంది. అప్పుడు క్రమంగా మౌనం అనుభవంలోకి వస్తుంది అన్నారు.

# సత్యం మాత్రమే నీలోంచి నిన్ను విడుదల చేస్తుంది

గణితంలో మేధావి అయిన ఒక వ్యక్తి నాన్నగారిని, లెక్కలకి అంతం ఎక్కడ? అని అడిగారు.

అప్పుడు నాన్నగారు "జ్ఞానం" అని చెప్పి, అంతేకాదు అన్ని శాస్త్రాలకు, అన్ని గ్రంథాలకు, అన్ని మతాలకు, అన్ని సైన్సులకు, అన్ని తత్వాలకు జ్ఞానమే గమ్యం అని చెప్పారు. ఈ సందర్భంగా ఐన్ స్టీన్ గురించి చెబుతూ, ఐన్ స్టీన్ గణిత శాస్త్రంలోనూ, భౌతిక శాస్త్రంలోనూ మహా మేధావి. అంతేకాక అతనికి జ్ఞానం పట్ల అవగాహన ఉండేది. వీటన్నిటికి అంతం జ్ఞానమే అని ఐన్ స్టీన్ గుర్తించాడు అని చెప్పారు.

---

ఒక పెళ్ళి కొడుకు, అన్ని ఏర్పాట్లూ పూర్తయ్యాకా ఒక వారంలో పెళ్ళి ఉందనగా, నాన్నగారి దగ్గరికి వచ్చి, ఈ పెళ్ళి చేసుకోకూడదు అనుకుంటున్నాను అన్నాడు. అందుకు కారణమేమిటి అని నాన్నగారు అడిగితే, ఆ అమ్మాయి పెళ్ళయ్యాకా నా మీద అధికారం చెలాయించేలా ఉంది, అది నాకు అసహనం కలిగిస్తోంది. అందుకే ఈ పెళ్ళి వద్దనుకుంటున్నాను అన్నాడు. అప్పుడు నాన్నగారు అమ్మాయి చాలా అందంగా ఉంది, ధనవంతురాలు, పైగా చదువుకుంది కదా! అన్నీ బానే ఉన్నప్పుడు ఇంత వరకూ వచ్చిన పెళ్ళిని ఆపడమెందుకు? కొన్ని విషయాలలో నువ్వు సర్దుకుపోతే సరిపోతుందేమో! అన్నారు. దానికి ఆ అబ్బాయి, నా స్వేచ్ఛని నేను కోల్పోయాకా అవన్నీ నేనేం చేసుకుంటాను? అన్నాడు.

ఆ తరువాత ఎప్పుడో నాన్నగారు ఆ సందర్భాన్ని గుర్తుచేసుకొని ఇలా చెప్పారు. మన స్వరూపం ఆనందమూ, శాంతి, స్వేచ్ఛ! దాన్ని కోల్పోవడానికి జీవుడు ఇష్టపడడు. బాహ్యమైన విషయాలకంటే కూడా, మనం ఎల్లప్పుడూ కోరుకునేది మన నిజమైన స్వరూప స్థితినే! జీసస్ కూడా "ఆత్మజ్ఞానం పొందవలసిందే, అది మాత్రమే నిన్ను స్వతంత్రుడిని చేస్తుంది!" అన్నాడు.

మనం ఎప్పుడైనా ఎవరికైనా నమస్కారం చేసినప్పుడు, వారిలో అంతర్యామిగా ఉన్న ఈశ్వరుడికి చేస్తాము. అలాగే ఒక జ్ఞానికి నమస్కారం చేసినప్పుడు అది సూటిగా ఈశ్వరునికే అందుతుంది. ఎందుకంటే అక్కడ వ్యక్తి లేడు, ఈశ్వరుడే తానై ఉన్నాడు. కాబట్టి, జ్ఞాని అడగకుండానే గౌరవించబడతాడు. అహంకారం ఉన్నవాడు అడిగినా గౌరవాన్ని పొందలేడు.

## మన నిజ స్వరూపానికి మరణం లేదు

భగవాన్ బోధకి నాన్నగారు, భక్తులకి సులభంగా అర్ధమయ్యే రీతిలో చిన్న చిన్న ఉదాహరణలతో వివరణ ఇచ్చేవారు.

పాండవులలో శ్రేష్ఠుడైన ధర్మరాజు (యుధిష్ఠిరుడు) ని యక్షుడు ప్రపంచంలో కెల్లా ఏది ఎక్కువ ఆశ్చర్యకరమైనది? అని అడిగాడు. అప్పుడు ధర్మరాజు లోకంలో ఎంతో మంది మరణించడం చూస్తూ ఉన్నా కూడా, మనకు మరణం వస్తుందని ఎవరూ గుర్తించకపోవడం ఆశ్చర్యకరం  అన్నాడు.

దీనికి భగవాన్, నీ నిజస్వరూపానికి చావులేదు. కనుక మనం చనిపోము అనుకోవడంలో ఆశ్చర్యంలేదు, అది సహజం అన్నారు.



ఒకసారి నాన్నగారి దగ్గర భక్తులంతా చేరి పండ్లు, స్వీట్లు సమర్పిస్తున్నారు. అప్పుడు నాన్నగారు ఒక భక్తురాలిని వీటిని ఏమంటారమ్మా? అని అడిగారు. ఆ భక్తురాలు ఏంమాట్లాడలేదు. అప్పుడు నాన్నగారు ఆఫరింగ్స్ అంటారు అని చెప్పి వాటిని చేతుల్లో పట్టుకుని కళ్ళు మూసుకొని, తరువాత కళ్ళు తెరిచి ఆమెకి తిరిగి ఇస్తూ దీనిని ప్రసాదం అంటారు అని చెప్పారు.

అలాగే మన కర్తృత్వాన్ని గనక ఆయనకి బహుమతిగా ఇస్తే, ఆయన మనల్ని పవిత్రం చేసి అనుగ్రహించి మన లోపల ఉన్న వస్తువుని మనం పొందేలా చేస్తారు.



## "అనుగ్రహంగా మారిన సమర్పణలు"

# మనసుని శుద్ధి చేసుకోవడం అవసరం

బ్రెజిల్ దేశం నుంచి వచ్చిన ఒక భక్తుడు (స్వామి) నాన్నగారిని, మనసు మనం కాదంటున్నారు కదా! మరి దానిని పవిత్రం చేసుకోవడం ఎందుకు? అని అడిగారు.

అప్పుడు నాన్నగారు శరీరం నేను కాదని ఆంటున్నాము కదా! మరి దానిని శుభ్రం చేసుకుంటున్నాము కదా! అందుచేత, మనసు మనం కాకపోయినా మనసుతో తాదాత్మ్యం పొందుతున్నాం కాబట్టి, దానిని పవిత్రం చేసుకోవాలి. లేకపోతే మన ఆత్మసాక్షాత్కారానికి అదే అడ్డు పడుతుంది అన్నారు.

---

ఒక భక్తురాలు నాన్నగారితో, నాకు ఇప్పటివరకూ భక్తిలేదు. నాకు చాలామంది స్నేహితులు ఉన్నారు, చెడ్డ అలవాట్లు ఉన్నాయి. మిమ్మల్ని చూసి, అరుణాచలాన్ని చూసాకా నాకు భక్తిగా జీవించాలని అనిపిస్తోంది. అయితే అరుణాచలం నుంచి ఇంటికి తిరిగి వెళ్ళాకా మళ్ళీ నా స్నేహితులు, పాత అలవాట్లవైపు వెళ్ళిపోతానేమో అని భయంగా ఉంది అన్నారు.

అప్పుడు నాన్నగారు నీ మనస్సు అంత బలహీనమా? నీ మనస్సు బలమైనది అయితే వాళ్ళే నీ దగ్గరకు వస్తారు. నీ మనస్సు బలహీనమైనది అయితే నువ్వే వాళ్ళ దగ్గరకు వెళ్ళిపోతావు. ఒక వివేకం ఉన్న వ్యక్తి తనకు ఏది మంచిదో దానిని ఎంచుకుంటాడు. నీకు వివేకం గనుక ఉంటే నువ్వు చెడు మార్గం వైపు ప్రయాణం చేయవు అన్నారు.



# శరీరం నువ్వు కాదు

నాన్నగారు ఒక భక్తురాలిని, నీ ఆరోగ్యం ఎలా ఉందమ్మా? అని అడిగారు. ఆమె భుజం లాగేస్తోందని చెప్పారు.

వ్యాయామాలు చేసుకో అమ్మా అని చెప్పి, శరీరంతో తాదాత్మ్యం వల్లనే ఈ పిర్యాదులన్నీ. శరీరంతో తాదాత్మ్యం వల్లనే నొప్పులతో తాదాత్మ్యం ఉంటోంది. మనకు భయం ఎక్కువగా ఉంది అంటే, భగవంతుడి పట్ల తగినంత విశ్వాసం లేదని అర్థం అన్నారు.

అప్పుడు ఆ భక్తురాలు, ఇదివరకు నాకు ఏదైనా కష్టం వస్తే అందులోంచి బయటకు రావడానికి సబ్జక్ట్ ఉపయోగపడేది. ఇప్పుడు అనారోగ్యం వచ్చాకా మనసు చెదిరిపోతోంది అన్నారు.

దానికి నాన్నగారు ఆరోగ్యంగా ఉన్నంత మాత్రాన మనం 1000 సం॥ లు జీవించి ఉండం కదా! శరీరానికి మనం తగినంత ఆహారం ఇవ్వాలి, దానిని శుభ్రంగా ఉంచాలి. అవసరమైతే దానికి మందు వేయాలి, రోజూ మన పని మనం చేయాలి. అంతేకానీ, దాని గురించి అతిగా ఆలోచించకూడదు. శరీరంతో గాని, మనసుతో గాని అతిగా తాదాత్మ్యం పొందితే, నేను శరీరం కాదు అనే భావన లోంచి బయటకు రాలేము. అప్పుడు మనకు పునర్జన్మ తప్పదు అన్నారు.

---

ఒకసారి నాన్నగారితో కలిసి ప్రయాణం చేస్తున్న ఒక భక్తురాలు నాన్నగారిని, శరీరంతో ఉన్న తాదాత్మ్యమే అన్ని దుఃఖాలకు కారణమా? అని అడిగారు.

నాన్నగారు, అవును! అయితే మీరనుకున్నంత కష్టంకాదు అందులోంచి విడుదల అవ్వడం. మనకి ఎవరింటికయినా వెళ్ళాలని అనిపిస్తే అది ఒక తలంపు! అలాగే శరీరం నేను అనేది కూడా ఒక తలంపు మాత్రమే! శరీరం నేను అనే భావనని ఉపసంహరిస్తే ఇప్పుడే, ఇక్కడే జ్ఞానం పొందవచ్చు అన్నారు.



# ఎప్పుడూ శాంతిని కోల్పోవద్దు

ఒక భక్తురాలు తన పిల్లల ప్రవర్తన విషయంలో, ఎన్ని సార్లు ఎన్ని విధాలుగా నచ్చచెబుతున్నా వాళ్ళలో మార్పు రావటంలేదని ఆందోళన చెందుతున్నారు. ఆమె ఒకరోజు నాన్నగారి దగ్గర మిగిలిన భక్తులతో కలిసి కూర్చున్నారు.

అప్పుడు నాన్నగారు ఆమె వైపు చూస్తూ, "భగవాను, రామకృష్ణుడు కొన్ని కొన్ని సందర్భాలలో భక్తుల ప్రవర్తన సరిగా లేకపోతే, వాళ్ళ శ్రేయస్సు కోరి కొద్దిగా ఆగ్రహాన్ని వ్యక్తం చేసేవారు. అయితే బుద్ధుడు మాత్రం ఎప్పుడూ శాంతిని కోల్పోలేదు. ఆ విషయం చెప్పి ఊరుకునేవాడు" అని చెప్పారు. అంటే, చెయ్యవలసింది చేస్తూ ఆందోళన పడకుండా, శాంతిగా ఉండమని ఆమెకు పరోక్షంగా తెలియజేసారు.

# ప్రారబ్ధాన్ని ప్రీతిగా అనుభవించాలి

ఒక భక్తురాలు చిన్న వయసులోనే తన భర్త చనిపోవడం వల్ల భరించలేని దుఃఖం అనుభవించారు. ఆమె నాన్నగారితో, నేను పూర్వజన్మలో ఎంత పాపం చేసుకుని ఉంటే ఈ పరిస్థితి వచ్చిందో కదా! అని అడిగారు.

అప్పుడు నాన్నగారు, ఆనందం స్వతంత్రమైనది. అది బాహ్యమైన వస్తువుల మీద, మనుషుల మీద, విషయాల మీద, పరిసరాల మీద ఆధారపడి ఉండదు. చావు అంటే, ఒక ఇల్లు ఖాళీ చేసి ఇంకో ఇంటికి వెళ్ళడం లాంటిది. నువ్వు శరీరంతో తాదాత్మ్యం పొందకూడదు. భగవంతుడు నియంత! మన ప్రారబ్ధ కర్మలను బట్టి దేహాలను నడుపుతూ ఉంటాడు! ప్రారబ్ధాన్ని కనుక నువ్వు పాయసం తాగినట్టు, ఆనందంగా అనుభవించగలిగితే, అది ఈ జన్మలో ఖర్చు అయిపోతుంది. మళ్ళీ జన్మకి అది నీ వెంటరాదు. 24 గంటలలో నీ దుఃఖాన్ని నేను తీసుకుంటాను. నీకు శాంతి వస్తుంది. అంతులేని శాంతిని నీకు ప్రసాదిస్తాను. నువ్వు ఆనందంగా ఉంటావు అన్నారు.

కొద్దికాలం తరువాత ఆ భక్తురాలు నాన్నగారిని కలిసినప్పుడు నా స్వభావం మార్చుకోవడం ఎలా నాన్నగారూ అని అడిగారు.


దానికి నాన్నగారు, స్వభావం మారడం చాలా కష్టం అమ్మా! పూర్వ జన్మ వాసనలు బలీయంగా ఉండడం వల్ల స్వభావం మారడం కష్టంగా ఉంటుంది. అయితే, నీ దృఢ సంకల్పం వల్ల, భగవంతుడు జోక్యం చేసుకొని అనుగ్రహించడం వల్ల నీ స్వభావం మారుతుంది. స్వభావం మారడానికి ఒక పద్ధతి ఏమిటంటే! సహనం, సహనం, మరింత సహనం అన్నారు.



# స్వప్రయత్నంతో కోపాన్ని తొలగించుకోవాలి

ఒక భక్తురాలు నాన్నగారితో, ఈ మధ్య నాకు కోపం ఎక్కువగా వస్తోంది. మా ఇంట్లోవాళ్ళ మీద చాలా చిన్న, చిన్న విషయాలకే కోపం తెచ్చుకుంటున్నాను. దాన్ని తొలగించుకోవాలని అనుకున్నా నాకు సాధ్యం కావడం లేదు అన్నారు.

అప్పుడు నాన్నగారు కోపం నీకు జరుగుబాటు అయిపోయింది. నువ్వు స్వప్రయత్నం చేసి కోపాన్ని తగ్గించుకోకపోతే, భగవంతుడే సన్నివేశాలు సృష్టించి నీ బలహీనతలలోంచి బయటపడేలా చేస్తాడు. అప్పుడు నీకు తలుపు సందున పెట్టి నొక్కినట్లు ఉంటుంది. నువ్వు స్వప్రయత్నం చేస్తే గనక నీకు భగవంతుడి అనుగ్రహం ఎప్పుడూ ఉంటుంది అన్నారు.





# ధనం ఎక్కువా వద్దు! తక్కువా వద్దు

ఒక కలెక్టరు గారి భార్య నాన్నగారితో, నా భర్త సంఘంలో మంచి గౌరవాన్ని పొందారు. కానీ, ఆస్తి మాత్రం చాలా తక్కువ సంపాదించారు అన్నారు.

నాన్నగారు మీకు ఉన్నది సరిపోవడం లేదా? ఇంకా ఎక్కువ సంపాదించి ఏం చేసుకుంటారు? ఇంతకుముందే మీ అమ్మాయికి పెళ్ళి కూడా అయింది. ఆ అమ్మాయి బ్యాంకులో ఉద్యోగం చేసుకుంటోంది. మీకూ పెన్షన్ వస్తుంది. మీకు అధనంగా ఎక్కువ డబ్బు రాకపోయినా మీకు ఉన్నది మీకు సరిపోతుంది కదా! ధనం ఎక్కువయ్యేకొలదీ, దొంగల భయం, ఇన్ కంటాక్స్ భయం వెంటాడుతుంది. అంతేకాక మీ మనసులని కూడా కలుషితం చేస్తుంది. అందుచేత, ధనం ఎప్పుడూ కూడా మనం ధరించే చెప్పుల జతలా ఉండాలి. చెప్పులు చిన్నవి అయితే రాళ్ళు, ముళ్ళు గుచ్చుకుంటాయి. పెద్దవి అయితే జారిపడతాం. కనుక అవి పాదాలకి సమానంగా ఉండాలి. అలాగే ధనం కూడా మనం జీవించడానికి అవసరమైనంత ఉంటే సరిపోతుంది! అన్నారు.

ఒక భక్తురాలు నాన్నగారితో, పూర్వం మిమ్మల్ని ప్రశ్నించి, అనుగ్రహ రూపంగా మీరు చెప్పిన సమాదానాల్ని నాతో మోసుకువెళ్ళేదాన్ని. ఇప్పుడు ఇంక అడగడానికి ఏమీ మిగలలేదు. మీ అనుగ్రహంతో మీరు ఏది ఇస్తే అదే ప్రసాదంగా తీసుకుంటాను అన్నారు.

అప్పుడు నాన్నగారు అనుగ్రహం అనేది కనపడనిది, వినపడనిది. అది "సహజంగా జరిగే దైవకార్యం" అన్నారు.

## గురువే మన రక్షకుడు

ఒక భక్తురాలు నాన్నగారితో, నేను ఎప్పుడు మీతో మాట్లాడదామని అనుకున్నా నా గొంతు పట్టేస్తుంది, మాటలు రావు. నా కళ్ళల్లోంచి కన్నీరు మాత్రమే వస్తుంది. ప్రతిసారీ ఇలా ఎందుకు జరుగుతుంది? అని అడిగారు.

అప్పుడు నాన్నగారు, గురువు అంటే ఎవరనుకున్నావు అమ్మా? ఆయన మన హృదయానికి దగ్గరవాడు! మన రక్షకుడు, మన ఆప్తుడు. మనకు దుఃఖం, కన్నీరు ఎవరి దగ్గర వస్తుంది? మన శ్రేయస్సు కోరి, మన హృదయానికి దగ్గరైనవాళ్ళ దగ్గర వస్తుంది. అని చెప్పి, ఆ భక్తురాలితో మూడు సార్లు "ఆప్తాయనమః" అని మంత్రం చెప్పించారు.




# మనస్సుని అంతర్ముఖం చేసుకో

ఒక భక్తురాలు నాన్నగారితో, బేర్ ఇన్సల్ట్, బేర్ ఇన్ జ్యూరీ ( గాయాన్ని, అవమానాన్ని భరించు ) అని మీరు చెపుతారు కదా నాన్నగారూ! అని అడిగారు.

అప్పుడు నాన్నగారు, వాస్తవానికి అవమానం భరించడం అంత సులభం కాదు. అది మనం మాటలలో చెప్పినంత తేలిక కాదు. కానీ శాస్త్రాలు చెపుతున్నాయి, అవమానం భరించు అది కూడా సాధనలో భాగమే అని! అవమానానికి ప్రతిస్పందన చూపించడం కంటే, అవమానాన్ని అంగీకరించి సహనంగా గనక ఉండగలిగితే, భగవంతుడి అనుగ్రహం ఎక్కువగా వర్షిస్తుంది. నీ సహనం వల్ల హృదయం యొక్క లోతులు పెరిగి నీ మనసు అంతర్ముఖం అవుతుంది.

ప్రతి సంఘటన వెనుక భగవంతుడు ఉన్నాడు! ఈ అవమానం ఆయనకి తెలియకుండా రావట్లేదు, ఇది నాకు పాఠం నేర్పి నాలో ఉన్న బలహీనతలు తొలగించడానికి వచ్చింది అనుకుంటే అవమానాన్ని భరించగలుగుతావు. దీనిని ఇంకొక విధంగా కూడా తీసుకోవచ్చు! ఇంతకు ముందు ఎప్పుడో, ఏదో జన్మలో ఇలాంటిది నేను ఇతరులకు చేయడం వల్ల, ఇప్పుడు నాకు అది ప్రతిఫలంగా వచ్చింది అని కూడా అనుకోవచ్చు. అంటే మనం వేసిన విత్తనం నుంచే ఈ మొక్క మొలిచింది అనుకున్నా కూడా అవమానం భరించగలవు. ఇంకొకటి కూడా నువ్వు గుర్తుపెట్టుకోవాలి. నువ్వు ఎవరిని అయినా అవమానపరిస్తే కనుక వాళ్ళలో ఉన్న అపవిత్రత, పాపము వాళ్ళలో తొలగిపోయి, అది నీకు వచ్చి చేరతుంది.



## “మోక్షం ఇచ్చే సమయం కోసం భగవంతుడు ఎదురు చూస్తున్నాడు”

ఒకసారి నాన్నగారు ఒక భక్తుడిని, నేను మీకు చెప్పిన పని మరిచిపోయారా? అని అడిగారు.

అప్పుడు ఆ భక్తుడు లేదు నాన్నగారూ నేను మరిచిపోలేదు, సరయిన సమయం కోసం ఎదురు చూస్తున్నాను అన్నారు.

ఆ మాటని ఉదాహరణగా తీసుకుని నాన్నగారు ఇలా చెప్పారు. జీవుడికే మరుపు రానప్పుడు ఈశ్వరుడికి మరుపు ఎలా వస్తుంది? నీ మనస్సుని అంతర్ముఖం చేసి, నీకు మోక్షం ఇచ్చే సమయం కోసం ఈశ్వరుడు ఎదురు చూస్తున్నాడు అన్నారు.

# కర్త లేని కర్మ చేయడం యోగం

కళ్ళ డాక్టరు నాన్నగారి కంటికి కేటరాక్ట్ ఆపరేషన్ చేసారు. ఆ డాక్టరు గారు నాన్నగారితో, నా సంతృప్తి కోసమే ఈ ఆపరేషన్ చేస్తున్నాను, ధనం ఆశించి కాదు అన్నారు. మీకు సర్జరీ చేయడానికి మీరు అనుమతి ఇచ్చారు జ్ఞాపకం ఉంది కదా అన్నారు నవ్వుతూ. ఆ డాక్టరు గారు మధురై లోని అరవింద ఐ హాస్పిటల్లో బాగా ట్రైనింగ్ పొందారు. ఆయన నాన్నగారిని మంచం మీద పడుకోమన్నారు. 3 నిముషాల తరువాత నాన్నగారిని మంచం మీద నుంచి లేవమన్నారు. ప్రతి పేషెంటుకీ ఆపరేషన్ చేసేముందు మత్తు ఇస్తారు కదా! అలా ఆ 3 నిముషాలు మత్తు ఇచ్చారేమో అని నాన్నగారు అనుకున్నారు. ఇదే విషయం నాన్నగారు డాక్టరు గారిని అడిగారు. మత్తుమందు ఇవ్వడం, ఆపరేషన్ చెయ్యడం కూడా అయిపోయింది మీరు లేవచ్చు అని డాక్టరు గారు చెప్పారు.

దీన్ని ఉదాహరణగా తీసుకుని నాన్నగారు ఇలా చెప్పారు. "సహనంతో, తెలివిగా, సమర్థవంతంగా ఫలితం ఆశించకుండా పని చెయ్యడం యోగం".





# మనోనిగ్రహానికి ఎన్నో మార్గాలున్నాయి

ఒక భక్తుడు నాన్నగారితో, భగవాను మనస్సు అణగటానికి ఆత్మ విచారణ చేయమని చెప్పారు కదా! ఆత్మ విచారణ చేసినా కూడా నా మనస్సు అణగటంలేదు. పైగా విజృంభిస్తోంది అన్నారు.

అప్పుడు నాన్నగారు, భగవాన్ చెప్పిన ఒక వాక్యాన్ని అంటిపెట్టుకుని ఉండి నీ మనస్సు అణగటం లేదంటున్నావు. ఆత్మ విచారణ మనోనాశనానికి సహకరిస్తుంది. అయితే, మనోనిగ్రహానికి కృష్ణుడు అనేక రకాల పద్ధతులు చెప్పాడు. భగవంతుడి మీద పరిపూర్ణ విశ్వాసం పెట్టుకొని ఆయనని స్మరించుకున్నా, జపం చేసుకున్నా, ధ్యానం చేసుకున్నా లేకపోతే ఆయన పాదాలకి సంపూర్ణ శరణాగతి చెందినా కూడా మనోనాశనం జరుగుతుంది. అందుచేత నీ మానసిక స్థితికి ఏది సహజంగా, సులభంగా అనిపిస్తుందో ఆ మార్గాన్ని అనుసరించి నువ్వు సాధన చేసుకోవాలి అని చెప్పారు.



# ప్రతీదీ ప్రారబ్ధాన్ని అనుసరించి జరుగుతుంది

ఒక వృద్ధురాలు నాన్నగారితో, నా భర్తతో నాకు సమస్యగా ఉంది. ఆయన మా కోడలు భోజనం వడ్డిస్తే ఒప్పుకోరు, నేనే వడ్డించాలని పట్టుబడతారు. నేను భోజనం పెడితే కానీ తినరు. ఇప్పుడు మేమిద్దరం ముసలివాళ్ళం అయిపోయాము. ఒకవేళ ఆయనకంటే ముందు నేను మరణిస్తే ఆయన చాలా ఇబ్బందిపడతారు. అందుచేత నాకంటే ముందే ఆయనే వెళ్ళిపోవాలని అనుకుంటున్నాను అన్నారు. కొంత సమయం తరువాత ఆవిడ వెళ్ళిపోయారు.

అప్పుడు నాన్నగారు, ఆవిడ కోరిక వల్ల పరిణామం ఎలా ఉంటుందో వివరిస్తూ ఇలా చెప్పారు. ప్రారబ్ధాన్ని బట్టి జీవితం నడుస్తుంది. అందుచేత ప్రారబ్ధాన్ని ఉన్నది ఉన్నట్టుగా అంగీకరించి జీవించడం మంచిది. ఇప్పుడు కాకపోయినా ఏదో జన్మలో ఆవిడ కోరిక నెరవేరుతుంది. అప్పుడు చిన్న వయస్సులోనే వైధవ్యం వచ్చే అవకాశం ఉంటుంది. అందుకే మనం ఏదీ కోరుకోకుండా ప్రారబ్ధాన్ని అనుభవించాలి అన్నారు

# భగవంతుడు నీకు కేటాయించిన పనిని ఇష్టంగా చెయ్యి

ఒక భక్తురాలు నాన్నగారితో ఇలా చెప్పారు. నా వివాహమైన మొదటి రోజునుంచీ నాకు నా భర్త పట్ల గౌరవం రాలేదు ఎందుకో! నిజానికి ఆయన మంచివారే. ఆయనకి కాఫీ ఇస్తున్నాను, భోజనం పెడుతున్నాను. కానీ, అవన్నీ కృత్రిమంగా చేస్తున్నాను. ఈ మధ్యే నేను రమణ భాస్కర చదివాను. దానిలో ఒక వాక్యం నన్ను ఆకర్షించింది! నీకు భగవంతుడు ఇచ్చిన పని కష్టంగా అనిపించినా, నీవు దానిని ఇష్టంగా చేస్తే ( నీ ఇష్టా, అయిష్టాలు ప్రక్కన పెట్టి ) జపం, ధ్యానం చేస్తే ఏ ఫలితం వస్తుందో, ఆ ఫలితం వచ్చేస్తుంది. ఈ వాక్యం చదివినప్పటి నుంచీ నేను ఇష్టంగా కాఫీ ఇస్తున్నాను, ఇష్టంగా భోజనం పెడుతున్నాను. ఇప్పుడు నాకు ఆనందంగా అనిపిస్తోంది. ఆయన కూడా సంతోషంగా ఉన్నారు అని చెప్పారు.

అంతా విని నాన్నగారు, నేను రమణ భాస్కర ముద్రించడం ఆపేద్దామని అనుకుంటున్నాను. కానీ, నీ మాటలు వింటుంటే ఇది చాలా ఉపయోగకరమని అనిపిస్తోంది! అందుకని నా ఉద్దేశ్యాన్ని ఉపసంహరించుకుంటాను అన్నారు.

---

ఒక భక్తుడు నాన్నగారితో, నాకు వైరాగ్యం లేదు కానీ, నా ప్రయత్నం లేకుండానే నా కోరికలన్నీ నెరవేరిపోతున్నాయి. అందువల్ల నేను చాలా ఆనందంగా ఉన్నాను. నాకు ముక్తి కూడా అప్రయత్నంగానే వచ్చేసేలా ఉంది అన్నారు.

అప్పుడు నాన్నగారు చాలా ఉదాసీనంగా మా కన్నా మీరు చాలా నయం అన్నారు. ఆ వ్యక్తి వెళ్ళిపోయిన తరువాత నాన్నగారు, ఈ రోజు వరకూ సృష్టిలో వైరాగ్యం లేకుండా జ్ఞానం పొందిన వారు లేరు. ఈశ్వరుడు నీకు కేటాయించిన పనిని నువ్వు ఇష్టంగా చేయగలిగితే జపం, ధ్యానం చేసిన ఫలితం వస్తుంది అన్నారు.


భగవతే శ్రీ

